# పరిచయం

రమణయ్యంత మంచివాడు లేడని చాలామంది అంటూండగా నేను విన్నాను. రమణయ్యని నేను కూడా ఎరుగుదును. రమణయ్యంత మంచివాడు లేడని చాలా మంది అంటూండగా నేను వినక పూర్వంగూడ అతన్నే నెరుగుదును.

మొన్నీ మధ్యనే నేను రమణయ్యని కలుసుకున్నాను గూడా. వాడు "యేంరోయ్!" అంటే నేను "యేమిట్రా!" అన్నాను. "ఇవ్వాళ నీ భోజనం మా యింట్లోనే" అన్నాడు.

ఇంట్లో వాళ్ళమ్మ పలుకరించింది. "ఇల్లు చూడ ముచ్చటగా వుంది బాబూ!" అంది.

"నేను అందామనుకుంటూన్నది నీ కెలా తెలిసిందమ్మా" అనక తప్పలేదు. అనేశాను.

పూరింట్లో పస్తులుండి కొడుక్కి చదువు చెప్పించిందావిడ. ఇవ్వాళ కొడుకు ప్రయోజకుడు కావటంవల్ల నలభై రూపాయల అద్దె చెల్లిస్తూ, డాబాలో నాలుగు గదులతో, రేడియోతో, కుర్చీలతో, డ్రాయర్లతో, అరవై వేలు తెచ్చిన కోడలితో జీవిస్తోంది. అల్లాంటి మనిషి చూచి ముచ్చటపడుతూన్న జీవితాన్ని ఎట్లా కాదనను?

ఇంతలోనే రమణయ్య కూతురొచ్చింది. మనుమరాల్ని చూచి అమ్మమ్మ ఎగిరి గంతేసింది. "బాబూ! కళ్ళు

వాళ్ళమ్మవి గాని, మిగతా అంతా అబ్బాయే!” అంటూ' నా కందించబోయింది. మర్చిపోయాను. రమణయ్య కూతురికి నాలుగు మాసాలుంటవేమో? ఆ పసిపిల్ల నెత్తుకొచ్చిన మరో పద్నాలుగేళ్ళ పిల్ల బెదురుతూ నిలబడి వుంది.

“ఈ యమ్మా యెవరు?”

“సుబ్బి! మా యింట్లో పనిచేస్తూ వుంటుంది. మన వాళ్ళే!” అన్నాడు రమణయ్య.

బహుశ వాళ్ళమ్మ సుబ్బమ్మని పిలుస్తుందేమో ఆ అమ్మాయిని. సుబ్బమ్మ చక్కటి పిల్ల. కట్టుకున్న గుడ్డలు గూడా ఖరీదైనవే. ఇప్పుడు చిరుగులు జాలు వారుతున్నట్లున్నయిగాని, బహుశ రమణయ్య భార్య తొడిగీ, కట్టీ విడిచినవేమో. ఐనా ఫర్వాలేదు. మనిషి గుండ్రంగా, బలంగా కూడా వుంది.

“అన్నంపెట్టి ఆరు రూపాయ లిస్తున్నాంరా నెలకి” అన్నాడు రమణయ్య.

అయితే రమణయ్య ఫర్వాలేదన్న మాట. వాడు చిన్నప్పుడు చెప్పిన మాటల్ని పూర్తిగా మరచిపోలేదన్న మాట, పనిచేసే వాళ్ళంటే ప్రేమవున్నది వాడికి. లేకుంటే ఆ పిల్ల అంత బలంగానూ, చక్కగానూ వుండేందుకు అవకాశాలుండి వుండవు. ఆ అమ్మాయంటే గౌరవము లేందే ఆ యింట్లో అట్లా తిరగగలుగుతుందా?

ఇన్ని చేస్తూ గూడ రమణయ్య సుబ్బమ్మని సుబ్బి

అని ఎందుకనాలో నాకు తెలియలేదు. కాని అప్పుడే అడిగేందుకు వీలులేకపోయింది.

రమణయ్యా, నేనూ చాలాసేపు మాట్లాడాం. మాట్లాడిన తర్వాత రమణయ్యంటే నాకున్న స్వతంత్రంలో కొంత గౌరవంకూడా యిరుక్కుంది. వాడు డబ్బంటే కాపీనం చూపించడు. తిండికి గుడ్డకి కావలసినంత ఖర్చు పెడతాడు. భార్యతో షికార్లకి వెళతాడు. సినిమాకు వెళ్తే 'బాక్స్'లో తప్పితే కూర్చోడు. ప్రజలంటే వాడికి అపరిమితమైన ప్రేమ. వున్నవాళ్ళ దగ్గర వున్నట్లుగానూ, లేనివాళ్ళ దగ్గర లేనట్లుగానూ, రాబడతాడు.

అదీ కాకుండా యింటికొచ్చే అతిథులకోసం రెండు గదులు ప్రత్యేకించాలనీ, వాళ్ళకేమీ యిబ్బంది లేకుండా వుండేటట్లుగా చేయాలనీ వాడు ప్లాన్ వేస్తున్నాడు. వాడికి గాంధీ మహాత్ముడంటే అపరిమితమైన గౌరవమూ, భక్తీని. కాని ఈ మధ్య వాడు రాచకీయాలు వదిలిపెట్టి ప్రజాసేవ చేస్తున్నాడు. ప్రజాసేవ చేసేవాడు రాజకీయకక్షలు పెట్టుకుంటే యెట్లా? అందుకనీ ఆ కక్షలు వదిలేశాడు. రాజకీయాలు చర్చించడు వాడు. కావాలంటే ఆత్మని గురించీ, మనసును గురించీ, మనస్తత్వాన్ని గురించీ ఎంతసేపైనా చర్చించగలడు. "మనలో మాట"గా ఇంకో మాట కూడా అన్నాడు. "ఈ రోజుల్లో యేమంటే యేం కొంపంటుకుంటుందో చెప్పలేంరా. అందుకనే యెప్పుడైనా వుత్తరాలు వ్రాసినా ఆధ్యాత్మిక విషయాలూ, శాస్త్రీయ విషయాలూ వ్రాయికాని రాజకీయాలు మట్టుకు వ్రాయకు" అని.

ఎందుకనో వాడన్న మాటలంటే నాకు గురి కుదర లేదు, వాడన్న మాటలు యెవరూ అనరని కాదు నేననేది. ఆ మాటలు వాడెట్లా అనగలిగాడా అని. ఇంతకు పూర్వం యిట్లా మాట్లాడేవాడు గాదు. మనం బ్రతికేది నాలుగు రోజులేననీ, యీ నాలుగు రోజులూ వా డేమనుకుంటాడో, వీ డేమనుకుంటాడో అనుకుంటూంటే ఆ ప్రొద్దు కాస్తా గడచి పోతుందనీ, మన మేమనుకుంటూన్నామో తెలవక పూర్వమే మన నాలుగు రోజులూ నడచిపోతాయనీ అనేవాడు. ఇప్పుడు వీడికి విరుగుడెలా దొరికిందిరా అనుకున్నా న్నేను.

అయినా నేనేమీ అనలేదు. వాడా మాటన్నప్పుడు యేమీ అనలేదు. ఈ మాటన్నప్పుడూ యేమీ అనలేదు.

కాని వాడిలో వున్న ఒక గుణాన్ని మాత్రం నేను – నాలో నేనే – పొగుడుకొంటూంటాను; నా దగ్గర వాడు దాచిన విషయమంటూ లేదు.

వాడు పెళ్ళిచేసుకొన్న తర్వాత యిదే మొదటిసారి నేను వాడిని కలుసుకోవడం. వాడెప్పుడూ అందమంటే పడి చచ్చేవాడు. ఒకసారి మమ్మల్నెరిగిన అమ్మాయి – అంద మైనది, "అన్నయ్యా! కవర్లు తెచ్చిపెట్టవూ హైస్కూలు నుంచి నువ్వు వచ్చేప్పుడు" అంటే, "ఇంకెవరన్నా అడిగితే యేవోగానిఁ నువ్వడిగితే కాదనలేను" అన్నాడు. డబ్బుగూడా పుచ్చుకోలేదు.

పాపం ఆ అమ్మాయి రెండు మూడు రోజులు వరసనే వచ్చింది. "తెచ్చావా అన్నయ్యా!" అంటూ. మూడోనా

డనుకొంటూ *తెచ్చాను. గదిలో పెట్లో వున్నాయి, రాయిస్తాను" అన్నాడు. ఆ అమ్మాయి గది గుమ్మంవరకూ వెళ్ళింది. మేం వసారాలో కూర్చున్నాం. మా వాడు గూడా వెళ్ళాడు, ఆ అమ్మాయి పాముని చూచినట్లుగా పరుగెత్తుకొచ్చింది వసారాలోకి. మా వంక చూచి, యేడుస్తూ యింటికి వెళ్ళింది. మా వాడు గూడ వచ్చాడు వసారాలోకి. "యేమిట్రా" అంటే ముఖం తేలవేశాడు. వాడికి అందమంటే అంత ప్రేమ.

వాడికున్న ప్రేమ గుడ్డిది గాదు. చదువుకున్న అమ్మాయినీ, అందమైన అమ్మాయినీ, తెలివిగలదాన్నీ పాడగలిగిన దాన్నీ డబ్బు లేకపోయినా సరే కట్నం లేకపోయినా చేసుకుంటాననేవాడు. వాడి భార్యని నేనైతే చూడలేదు గాని చూచినవాళ్ళు చెబుతుండగా విన్నాను. ఆ అమ్మాయిలో ఆ అన్ని గుణాలు వున్నవి. దానికితోడు అరవై వేలు గూడా పట్టుకొచ్చింది.

పెళ్ళయిన క్రొత్త రోజులలో కొంతమంది వాడు చెప్పిన మాటలన్నీ మరచిపోయాడనీ డబ్బుకి కక్కుర్తిపడ్డాడనీ అన్నారు. ఎంతవరకు నిజమని అడిగాను వాడిని. "అప్పుడు వాళ్ళందరికి పెళ్ళీడుకొచ్చిన ఆడపిల్లలున్నార్రా" అన్నాడు రమణయ్య.

తర్వాత తన భార్య సంగతి చెప్పాడు: భార్యతో వాడు కావాలని అనుకున్న లక్షణాలన్నీ వున్నాయి. కాని ఆ అమ్మాయి ఇంగ్లీషు చదువుకోలేదు. మొట్టమొదట తానే

నేర్పవచ్చని అనుకున్నాడు కాని తర్వాత ఆ అవసరం కన్పించలేదు. రాను రాను అనవసరం అని గూడా దృఢంగా నిశ్చయించుకున్నాడు. వాడు చెప్పిన కారణాలన్నీ చెప్పగల గడం కష్టం. వాడింట్లో ప్రతి గది తలుపులకి, కిటికీ తలుపులకి కర్టెన్లెందుకూ, ఈ అభిప్రాయానికీ ఏ విధమైన సంబంధం లేదని గూడా చెప్పాడు వాడు. అవంటే అందానికి శాస్త్రీయ కారణాల్తో కట్టాడు. తెరలన్నీ ఆకాశం నీలిరంగుతో వుంటే కళ్ళకి మంచిది. వాడు డాక్టరు. వాడు చెప్పినది కాదనగల తాహతు లేకపోయింది నాకు. నేను కాదనలేను.

వాడు భార్యకు పూర్తి స్వాతంత్ర్యం యిచ్చాడు. అత్త, కోడళ్ళ మధ్య వచ్చిన చిన్న చిన్న తగాదాలన్ని సవ్యంగా పరిష్కరించాడు. అటు అమ్మకి తనంటే కొడుక్కి యెంతో భక్తి వుందని నమ్మకం కలిగింది. ఇటు భార్యకి తనంటే భర్తకి ఎంతో ప్రేమ వుందనే నిదర్శనమూ వుంది. వాడు "మాలో మాట"గా ఇంకో విషయంగూడా చెప్పాడు. వాడి భార్య ప్రతి శనివారమూ తలంటుకుని తులసిపూజ చేస్తుంది.

చాలామంది భార్యలు చేస్తుంటారు. అందులో విశేష మేమీ లేదు. కాని రమణయ్య చాలామంది భర్తలలాంటి వాడు కాదు. వాడు రాజకీయాలు వదలుకున్నాడు కాని శాస్త్రీయమైన విషయాలు వదలుకోలేదు. వాడు కాలేజీలో చదువుకొనే రోజులలో నాస్తికులు రామచంద్రరావుగారి శిష్యులు. ఇప్పటికి వాడికి ఆ ఉద్దేశాలు బలపడుతూనేవుంటం వల్ల మార్చుకోవలసిన అవసరము కలగలేదు, నాస్తికత్వ

నికీ, రాచకీయాలకీ ఈమధ్య యేర్పడిన సంబంధాలవల్ల వాడి ఉద్దేశాలు చెదరలేదు. ఇవ్వాళ వాడిని వేదికెక్కి నాస్తికత్వాన్నిగురించి ఉపన్యాస మియ్యమంటే వాడివ్వకపోవచ్చు. అది వేరే సంగతి.

"చెప్పి చూశావురా?" అన్నాను.

"నేను చెప్పనూ లేదు. చూడనూ లేదు".

"స్వాతంత్ర్యానికి అడ్డము వెళ్లదలచుకోలేదా!"

"నీ పిండాకూడు." వాడంత తెలివితక్కువవాడు కాదు.

"మరెందుకని చెప్పలేదు, చెప్పినా వినదనా?"

"ఏడిశావు!" వాడి మాటల్లో అధికారం వుంది.

"మరేమట్రా?"

వాడు మాట్లాడలేదు. ఏమిటో గొడవ వుందనే అనుమానం వేసింది నాకు. వీడు చెప్పివుంటాడు. కాని వీడు చెప్పిన కారణాలు ఆవిడకి అవగాహన అయివుండవు. వీడేదో శాస్త్రం విప్పి వుంటాడు రెండు మూడు రోజులు యిద్దరూ అన్నాలు తినివుండరు. తర్వాత ఆ ఒక్క విషయంలోనూ "వ్యక్తి స్వాతంత్ర్యం" ఇచ్చుకున్నారేమో. కాని వీడంత తెలివితక్కువవాడు గాదే! నచ్చచెప్పగల శక్తి వుందే. నేను ఘోర్తుఘారం చదువుతూండగా "నెహూ్రి ఆత్మకథ చదివావురా" అంటే మూడు రోజులు ఆ ఆత్మకథలో నేను చదవని వాట్నిగురించి ఉపన్యాసం యిచ్చాడు. అప్పుడు వాడి తెలివి చూచి ఎంతో ఆశ్చర్యపడ్డాన్నేను.

రమణయ్య యింకో "మాలో మాట" చెప్పాడు: తలంటుకొని భార్య తులసిపూజ చేస్తుంటే వాడికి చూడబుద్ధి

అవుతుంది. అప్పుడు క్రొత్తకాంతి ఆవిడ ముఖాన్నంతా మెరిపించుతుంది. ఆ చిక్కు తీయని తడి తలా, ముడిపడని ముడీ, తడి ఆరని కుంకుమా, పసుపు పూసుకొన్న కాళ్ళు, పాయల మధ్య పడిన పచ్చని బియ్యం, వింతగా ఆకర్షిస్తుంది వాడిని. ఆనాడు వాడిలో ఆ వారం రోజులలోను నిద్రపోతున్న కోర్కెలన్నీ మళ్ళీ చిగురుస్తాయి. వాడి అంతరాంతరాలలోనుంచీ, చీకటి కోణాలనుంచీ ఇంతవరకూ బూడిద కప్పుకున్న నిప్పు రవ్వలు లేస్తాయి. ఆ వారంరోజులలోను మరువలేకపోయిన విసుగూ, కోపమూ, అసహ్యమూ, కార్యక్రమం అన్నీ సుడిగాలిలో యెగిరిపోతాయి. మళ్ళీ వాళ్ళిద్దరి మధ్య దారుల బారులు తగ్గిపోతాయి. ఆ ఆవిడలో యింకా తనకు తెలియని తాను తెలుసుకోలేని చీకట్లున్నాయనీ, తాను తడవని వెలుగు కాంతులున్నాయనీ, వాడికి గుర్తుకొస్తుంది. ఆ చీకట్లో లోతులూ, వెలుగుల కిరణాలూ, తడివి చూద్దామనే కాంక్ష అప్పుడుగాని కలగదు వాడికి. ఆలాంటి అవకాశాన్నిచ్చే తులసిపూజ మానమని యెట్లా చెప్పగలడు?

రమణయ్య చాలా చెప్పాడు. నేనేమీ చెప్పలేకపోయాను. వాడు ప్రకృతికి భక్తుడేమో; దాసానుదాసుడేమో! వాడిని చూచి నేను అసూయపడలేదు; నేనడుగుదామనుకున్న ప్రశ్న మరచిపోలేదు.

"ఆ యమ్మాయి "మనవాళ్ళే"నంటావు గదా సుబ్బీ అని పిలుస్తావేమిరా?" అన్నాను. మనవాళ్లు కాకపోతే వాడు సుబ్బీ అని పిలిస్తే నేను యేమని అభ్యంతరం చెప్పేవాడినో!

—:•:—